

ఆర్జీ–1 జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, నాయకులు

# లాభాల్లో వాటా ఎప్పుడిస్తరు?

- ఆర్థిక సంవత్సరం మొదలై ఆరు నెలలైనా ప్రకటించరా..
- సింగరేణి యాజమాన్యంపై టీబీజీకేఎస్ మండిపాటు
- కార్మికులకు అండగా ఆందోళన
- రామగుండంలోని మూడు డివిజన్లలో భారీ ధర్నాలు

గోదావరిఖని/ యైటింక్లయిన్‌కాలనీ/ రామగిరి, సెప్టెంబర్ 19: సింగరేణి కార్మికులకు లాభాల్లో వాటా కోసం టీబీజీకేఎస్ పోరుబాట పట్టింది. ఆర్థిక సంవత్సరం మొదలై ఆరు నెలలైనా ఎలాంటి ప్రకటన లేకపోవడంతో లాభాల వాటా చెల్లింపు తేదీని ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఆందోళనలకు దిగింది. గురువారం సింగరేణి ఆర్జీ–1, 2, 3 జీఎం కార్యాలయాల ఎదుట భారీ ధర్నాలు చేసి, జనరల్ మేనేజర్లకు వినతి పత్రాలు అందజేసింది. సింగరేణి ఆర్జీ–1 జీఎం కార్యాలయం ఎదుట టీబీజీకేఎస్ ఆర్జీ–1 ఉపాధ్యక్షుడు వడ్డెపల్లి శంకర్ ఆధ్వర్యంలో భారీ ధర్నా చేయగా, టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డితోపాటు నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఆర్జీ–1 జీఎంకు వినతిపత్రం అందజేశారు. అలాగే రామగుండం ఆర్జీ–2 ఏరియా జీఎం కార్యాలయం ఎదుట ఆర్జీ–2 టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మహాధర్నా చేపట్టారు. డీజీఎం పర్సనల్ అనిల్ కుమార్‌కు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఇక రామగిరిలోని ఆర్జీ –3 జనరల్ మేనేజర్ కార్యాలయం ఎదుట టీబీజీకేఎస్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ పింగిలి సంపత్ రెడ్డి ఆధ్వర్యంలో ధర్నా చేసి, పర్సనల్ మేనేజర్ సుదర్శనంకు వినతి పత్రం అందజేశారు.

**ఈ నెలాఖరు వరకు ప్రకటించాల్సిందే : మిర్యాల రాజిరెడ్డి**

2023–24 సంవత్సరానికి గాను సింగరేణికి వచ్చిన వాస్తవ లాభాలను ప్రకటించి, ఈ నెలాఖరు వరకు 35 శాతం వాటాను కార్మికులకు చెల్లించాలని టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. సింగరేణిలో ఎప్పుడూ లేని విధంగా 70మిలియన్ టన్నుల రికార్డు స్థాయిలో బొగ్గు ఉత్పత్తి జరిగిందని, ఆర్థిక సంవత్సరం గడిచి ఆరు నెలలు దాటిన వాస్తవ లాభాలను ప్రకటించడంలో యాజమాన్యం ఎందుకు జాప్యం చేస్తున్నదో చెప్పాలన్నారు. గతానికి భిన్నంగా ఈ ఏడాది ఇప్పటి వరకు లాభాలు ప్రకటించకపోవడంతో కార్మికులు ఆందోళన చెందుతున్నారని, దసరా పండుగ సమీపిస్తున్నందున ఈ నెలాఖరు వరకు లాభాల్లో వాటా ప్రకటించాలన్నారు. లేదంటే టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో కొత్తగూడెం, హైదరాబాద్‌లో భారీ ఎత్తున ధర్నా చేస్తామని హెచ్చరించారు. అందుకు కార్మికులంతా సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.



వేములవాడ పోలీస్ స్టేషన్‌లో బీఆర్ఎస్ నాయకులు

# ప్రజా ఉద్యమంపై నిర్బంధం



కథలాపూర్: పోలీస్‌స్టేషన్‌లో బీఆర్ఎస్ నాయకులు

- రైతన్నకు మద్దతిచ్చిన బీఆర్ఎస్ నేతలు
- ప్రజా భవన్ ముట్టడికి తరలివెళ్తారని ముందస్తు అరెస్టులు
- సర్కారుపై ఆగ్రహించిన నాయకులు



మల్లాపూర్‌లో పోలీస్‌స్టేషన్ ఎదుట రైతు సంఘాల నాయకులు



రుద్రంగి పోలీస్‌స్టేషన్‌లో బీఆర్ఎస్ నాయకులు

ప్రజా ఉద్యమంపై నిర్బంధం మోపుతున్నారు. రైతన్నకు మద్దతిచ్చిన బీఆర్ఎస్ నాయకులను ముందస్తుగా అరెస్టు చేశారు. రుణమాఫీ కాని రైతుల పిలుపు మేరకు 'ఛలో ప్రజా భవన్' ధర్నాకు వెళ్లకుండా నేతలను గురువారం ఉదయమే అదుపులోకి తీసుకుని, స్టేషన్లకు తరలించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి తరలి వెళ్తున్న వారిని ఎక్కడికక్కడ అడ్డుకోవడంతో బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి అక్రమ అరెస్టులతో రైతుల ఉద్యమంను ఆపలేరని, రైతుల సమస్యలను పరిష్కారం అయ్యేంత వరకు ఉద్యమిస్తామని హెచ్చరించారు.

**- జగిత్యాల, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ)**

- పెండింగ్‌లో బిల్లులు.. ప్రజలకు అవస్థలు
- అంధకారంలో కోనరావుపేట
- మూడు నెలలుగా వెలగని వీధిలైట్లు
- డీజిల్ లేక మూలన పడ్డ ట్రాక్టర్



కోనరావుపేటలో రాత్రి పూట కరెంటు లేక అంధకారంలో ఓ వీధి

# లైట్లు వెలుగయ్.. ట్రాక్టర్లు నడువయ్!



డీజిల్ లేక మూలన ఉన్న ట్రాక్టర్

'ప్రత్యేక' పాలనలో పల్లెల్లో అభివృద్ధి కుంటుపడుతున్నది. పెండింగ్ బిల్లులు చెల్లించకపోవడంతో ప్రజలు నిత్యం నరకం అనుభవించాల్సి వస్తున్నది. వీధి లైట్లు వెలగకపోవడంతో చీకట్లోనే మగ్గాల్సి వస్తున్నది. డీజిల్ లేక ట్రాక్టర్లు నడవక పోవడంతో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోతున్నది. అందుకు కోనరావుపేట మండలకేంద్రమే నిదర్శనంగా నిలుస్తున్నది.

**ఇబ్బందులు లేకుండా చూస్తా**

మండల కేంద్రంలో నెలకొన్న పలు సమస్యలు నా దృష్టికి వచ్చాయి. విద్యుత్ దీపాలు వెలగక పోవడం, డీజిల్ లేక ట్రాక్టర్ నడవకపోవడం వంటి సమస్యలు ఉన్నాయి. వాటిని పరిష్కరించేందుకు గ్రామ పంచాయతీ కార్యదర్శిని వివరాలు అడిగా. బిల్లులు చెల్లించకపోవడం వల్లే ఈ సమస్యలు తలెత్తాయి. త్వరితగతిన బిల్లులు చెల్లించి గ్రామస్తులకు ఇబ్బందులు లేకుండా చూస్తా.

**- శ్రీనివాస మూర్తి, ఎంపీడీవో (కోనరావుపేట)**

కోనరావుపేట, సెప్టెంబర్ 19 : కోనరావుపేట మండల కేంద్రంలో మూడు నెలలుగా వీధి దీపాలు వెలగకపోవడంతో రాత్రయితే అంధకారం నెలకొంటున్నది. ఇటీవల వినాయక నవరాత్రోత్సవాలు కూడా చీకట్లోనే సాగాయి. అలాగే, కొన్ని రోజులుగా డీజిల్ లేక చెత్త నిర్వహణ సాగడం లేదు. దీంతో ఇండ్లలో చెత్త పేరుకుపోవడంతో పాటు వీధులన్నీ కంపుకొడుతున్నాయి. అంతేకాకుండా తొమ్మిది నెలలుగా జీతాలు లేక పంచాయతీ సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. కాగా, ఇక్కడ కార్మికురాలిగా విధులు నిర్వహిస్తున్న మరియమ్మకు తొమ్మిది నెలలుగా జీతం ఇవ్వకుండా ఆమెను విధుల నుంచి తొలగించాలని ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామ పంచాయతీలో పెండింగ్‌లో ఉన్న బిల్లులు వెంటనే చెల్లిస్తేనే సమస్యలు పరిష్కారమవుతాయని గ్రామపంచాయతీ కార్యదర్శి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. చెత్త సేకరించే ట్రాక్టర్ డీజిల్ బిల్లు ₹లక్ష, వీధి దీపాల ఏర్పాటుకు దుకాణం వద్ద పెండింగ్ బిల్లు ₹70 వేలు ఉండగా, వాటిని చెల్లించకపోవడంతో ప్రజలకు కనీస సౌకర్యాలు కరువయ్యాయి.

## వృద్ధదంపతుల దాతృత్వం

**రూ.కోటి విలువైన భూ విరాళం**

రామడుగు, సెప్టెంబర్19 : కరీంనగర్ జిల్లా రామడుగు మండలం గోలిరామయ్యపల్లి పరిధిలోని నునుగొండపల్లి గ్రామానికి చెందిన నునుగొండ రామవ్వ–లస్మయ్య దంపతులు దాతృత్వం చూపారు. వారితో పాటు తమ కుటుంబ సభ్యులు రూ.కోటి విలువైన ఎకరం ఆరు గుంటల భూమిని గ్రామ అభివృద్ధి కోసం విరాళంగా అందించారు. కాగా, గ్రామంలో వృద్ధ దంపతుల కొడుకు ప్రభాకర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలన్న కోరిక మేరకు, మాజీ సర్పంచుల ఫోరం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఉప్పుల అంజనీప్రసాద్ రూ.40 వేలు అందించి విగ్రహాన్ని గురువారం ఆవిష్కరించారు. గ్రామానికి రూ.కోటి విలువైన స్థలాన్ని అందించినందుకు వృద్ధ దంపతులను అంజనీప్రసాద్ శాలువాతో సత్కరించారు. రామవ్వ–లస్మయ్య దంపతులు ఆదర్శప్రాయులని కొనియాడారు. ఇక్కడ మాజీ ఉప సర్పంచు నునుగొండ ప్రభాకర్, అశోక్, మల్లేశం, పంచాయతీ కార్యదర్శి అక్షిత ఉన్నారు.



దంపతులను సన్మానిస్తున్న సర్పంచుల ఫోరం రాష్ట్ర మాజీ గౌరవాధ్యక్షుడు ఉప్పుల అంజనీప్రసాద్

# పనికి తగ్గ వేతనాలు ఇవ్వాలి


- పూర్తిస్థాయి సిబ్బందిని నియమించాలి
- కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు దుమాల సీవోఈ టీచర్ల మొర



దుమాలలో సిబ్బందితో మాట్లాడుతున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 19: 'మేం ఏడేండ్ల కింద కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్ టీచింగ్ స్టాఫ్‌గా ఒప్పంద ప్రతిపాదికన నియమితులైనం. రెగ్యులర్ స్టాఫ్ లాగే ఉదయం 6గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు విధులు నిర్వహిస్తున్నం. కానీ, మా కష్టానికి తగ్గ ప్రతిఫలం దక్కడం లేదు. పనికి తగ్గ వేతనాలు ఇవ్వాలి' అని దుమాల సీవోఈ టీచింగ్ సిబ్బంది కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు విన్నవించారు. గురువారం దుమాల ఏకలవ్య మాడల్ రెసిడెన్షియల్ పాఠశాల, కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రాన్ని బండి సంజయ్ సందర్శించగా, ఈ మేరకు తమ సమస్యలను ఏకరువుపెట్టారు. ఎంబీబీఎస్, జేఈఈ సీట్లను సాధించడంలో ఎంతో కష్టపడ్డామని, అలాగే టర్మ్–1 పూర్తవుతున్నా ఇప్పటి వరకు జూనియర్, సీనియర్ ఇంటర్ తరగతులుకు ఇంగ్లిష్ లెక్చరర్ లేరని చెప్పారు. ఇక పాఠశాలలో నాన్‌టీచింగ్ సిబ్బంది కొరత ఉన్నదని, 8 మందికి ఇద్దరే పని చేస్తున్నామని, పూర్తిస్థాయిలో నియమించాలని నాన్ టీచింగ్ స్టాఫ్ కోరారు.

మైనార్టీ గురుకుల పాఠశాలలో యూనిఫాం లేకుండా విద్యార్థులు



మైనార్టీ గురుకుల విద్య మిథ్యగా తయారవుతున్నది. విద్యాలయాల నిర్వహణ గాడి తప్పి అందని ద్రాక్షగా మారుతున్నది. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఆధునిక సౌకర్యాలు, వసతులతో పిల్లలు ఏ లోటూ లేకుండా అభ్యసించగా, ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యం.. అధికారుల పట్టింపులేమితో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యాసంవత్సరం ప్రారంభమై మూడు నెలలైనా పూర్తిస్థాయిలో యూనిఫాంలు, షూలు, బుక్స్, నోట్స్ అందక అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా బాల, బాలికలకు మూడు నెలలకోసారి అందించే కాస్మోటిక్ కిట్లు సైతం ఇవ్వకపోవడంతో బయట కొనుక్కునే పరిస్థితి వచ్చిందని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించాలని కోరుతున్నారు.

# మైనార్టీ విద్య.. మిథ్య!

## గాడితప్పిన గురుకుల విద్యాలయాల నిర్వహణ

- విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు నెలలైనా అందని యూనిఫామ్స్, షూలు, బుక్స్, నోట్స్
- కాస్మోటిక్ కిట్లకూ బ్రేక్
- నాలుగు నెలలుగా పెండింగ్‌లోనే డైట్ చార్జీలు
- ఇబ్బందుల్లో విద్యార్థులు.. పట్టని ఉన్నతాధికారులు

పెద్దపల్లి, సెప్టెంబర్ 19 (నమస్తే తెలంగాణ)/పెద్దపల్లి కమాన్: మైనార్టీ పేద పిల్లలకు నాణ్యమైన విద్యనందించాలన్న లక్ష్యంతో ఏర్పాటైన మైనార్టీ గురుకులాలు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఎంతో సమర్థవంతంగా నడిచి ఖ్యాతి గడించిన ఈ స్కూళ్లు, ప్రస్తుతం అధ్వానంగా మారాయి. పెద్దపల్లి జిల్లాలో మూడు మైనార్టీ గురుకులాలు ఉండగా, ఇంటర్మీడియెట్ దాకా తరగతులు నిర్వహిస్తున్నారు. పెద్దపల్లి మైనార్టీ బాలికల స్కూల్లో 5 నుంచి పదో తరగతి దాకా 285 మంది, ఇంటర్‌లో 90 మంది అభ్యసిస్తున్నారు. మంథని మైనార్టీ బాలికల స్కూల్లో 5 నుంచి పదో తరగతి దాకా 210 మంది, ఇంటర్‌లో 80 మంది, రామగుండం బాలుర స్కూల్లో 5 నుంచి పదో తరగతి దాకా 338 మంది, ఇంటర్‌లో 111 మంది అభ్యసిస్తున్నారు. యూనిఫాంలు, బుక్కులు రాక ఇబ్బందులు పడుతున్నారు.

**యూనిఫాంలు, టెక్స్ట్, నోట్ బుక్స్ ఏవి?**

జిల్లాలోని మూడు మైనార్టీ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ఈ విద్యా సంవత్సరం మొత్తం 1,114మంది అభ్యసిస్తున్నారు. నిబంధనల ప్రకారం ఒక్కో విద్యార్థికి రెండు జతల యూనిఫామ్స్, ఒక జత షూ ఇవ్వాల్సి ఉంటుంది. అయితే విద్యాసంవత్సరం ప్రారంభమై మూడు నెలలవుతున్నా పంపిణీ చేయలేదు. ఒక జత స్పోర్ట్స్ డ్రెస్ ఇవ్వాల్సి ఉండగా, బాలురకు మాత్రమే పంపిణీ చేసి, బాలికలకు మొండిచేయి చూపారు. ఇక ఆయా సబ్జెక్టులకు సంబంధించిన టెక్స్ట్, నోట్ బుక్స్ కూడా పంపిణీ చేయకపోవడంతో విద్యార్థులు చదువుకొనలేక పోతున్నారు.

**కానరాని కాస్మోటిక్ కిట్స్**

గురుకుల విద్యార్థులకు మూడు నెలలకోసారి కాస్మోటిక్ కిట్స్ ఇవ్వాల్సి ఉంటుంది. బాలికలకు రిబ్బన్స్ (వైట్, బ్లాక్), పేల దువ్వెన, హెయిర్ బ్యాండ్స్, వాషింగ్–బాతింగ్ సబ్బులు, కోకోనట్ ఆయిల్, బ్రెష్, టూత్ పేస్ట్, టంగ్ క్లీనర్, షాంపు, పౌడర్, సానిటరీ న్యాప్ ప్యాడ్స్‌తో కూడిన కిట్స్ ఇస్తుంటారు. బాలురకు దువ్వెన, వాషింగ్–బాతింగ్ సబ్బులు, కోకోనట్ ఆయిల్, బ్రెష్, టూత్ పేస్ట్, టంగ్ క్లీనర్, షాంపు, పౌడర్ ఇస్తుంటారు. అయితే విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు నెలలు గడుస్తున్నా కిట్స్ ఇవ్వకపోడంతో పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. సొంత ఖర్చులతో కిట్స్‌ను కొనుక్కోవాల్సిన పరిస్థితి వచ్చింది.

**డైట్ బిల్లులూ పెండింగే**

మైనార్టీ గురుకులాల్లో గత విద్యాసంవత్సరంలో చివర మార్చి, ఏప్రిల్, మే నెలతోపాటు ప్రస్తుత విద్యా సంవత్సరం జూలై నెలకు సంబంధించి డైట్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. పెద్దపల్లి గురుకులానికి సంబంధించి ₹7 లక్షలు, రామగుండం స్కూల్‌కు సంబంధించి దాదాపు ₹12 లక్షలు, మంథని స్కూల్‌కు సంబంధించి దాదాపు ₹6.50 లక్షల బిల్లులు ఆగిపోయాయని, ప్రభుత్వం నుంచి ఎలాగైనా బకాయిలు ఇప్పించాలని ఆయా విద్యాలయాల ప్రిన్సిపాల్స్‌ను డైట్ కాంట్రాక్టర్లు కోరుతున్నారు. అలాగే మూడు గురుకులాలకు సంబంధించి అద్దె సైతం ఏడాదిగా బకాయి ఉన్నట్లు తెలిసింది.

**ప్రభుత్వానికి నివేదించాం**

మూడు గురుకులాలకు సంబంధించి నాలుగు నెలల డైట్ బిల్లులు, అద్దె, పెండింగ్‌లో ఉన్నాయి. యూనిఫాంలకు సంబంధించి కొలత తీసుకొని పంపించాం. స్పోర్ట్స్ దుస్తులు వచ్చాయి. ఇంకా కొన్ని పంపిణీ చేయాల్సి ఉంది. షూలకు సంబంధించిన సైజులు పంపించాం. ఆ ప్రకారం త్వరలోనే పంపిణీ జరుగుతుంది. కాస్మోటిక్ కిట్స్ పంపిణీ కూడా చేయాల్సి ఉంది. త్వరలోనే అందజేస్తాం.

**-సురేశ్, మైనార్టీ గురుకులాల ఇన్‌చార్జి (కరీంనగర్)**

# విద్యుత్ కంచెలే మృత్యుపాశాలై

- పొలానికి మందు కొట్టేందుకు, నీళ్లు పెట్టేందుకు వెళ్లి వేర్వేరు చోట్ల ఇద్దరు రైతుల మృతి
- కోతులు, వన్యప్రాణుల నుంచి రక్షణ కోసం అక్రమంగా వేసిన విద్యుత్ తగిలి షాక్



జెల్ల పెద్ద ముత్తన్న (ఫైల్)



రాయమల్లు (ఫైల్)

మల్లాపూర్, సెప్టెంబర్ 19: పొలానికి మందు కొట్టేందుకు వెళ్లి ఒకరు, నీళ్లు పెట్టేందుకు ఇంకొకరు విగతజీవులై పోయారు. కోతులు, వన్యప్రాణుల నుంచి పంటల రక్షణ కోసం సమీప పొలాల రైతులు ఏర్పాటు చేసిన విద్యుత్ కంచెలకు తగిలి ప్రాణాలు కోల్పోయారు. పోలీసుల వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం కుస్తాపూర్‌కు చెందిన జెల్ల పెద్ద ముత్తన్న (60) గురువారం గ్రామ శివారులో ఉన్న తన పొలం వద్దకు మందు చల్లడానికి వెళ్లాడు. పక్కనే రత్నాపూర్ గ్రామానికి చెందిన రైతు గొండ సాయన్న తన మక్క చేనును కోతుల బెడద నుంచి కాపాడుకునేందుకు ఎ లాంటి అనుమతులు లేకుండా చుట్టూ ఇనుప కంచె ఏర్పాటు చేసి, వ్యవసాయ మోటరు నుంచి అక్రమంగా కరెంట్‌ను పెట్టాడు. ఈ క్రమంలో పెద్ద ముత్తన్న పొలానికి మందు చల్లి ఇంటికి వచ్చేటప్పుడు ప్రమాదవశాత్తూ ఇనుప కంచెకు తాకడంతో షాక్‌కొట్టి అక్కడిక్కడే మృతి చెందాడు. సమయం గడిచిన పెద్ద ముత్తన్న ఇంటికి రాకపోవడంతో బాధిత కుటుంబ సభ్యులు వెళ్లి గాలింపు చర్యలు చేపట్టగా అక్కడే మృతి చెంది కనిపించాడు. మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి భార్య జెల్ల పెద్దరాజు ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన సాయన్నపై కేసు నమోదు చేశారు.

**పత్తిపాకలో మరో రైతు**

ధర్మారం సెప్టెంబర్ 19: ధర్మారం మండలం పత్తిపాకకు చెందిన రైతు దయ్యాల రాయమల్లు (56)కు గురువారం ఉదయం గ్రామ శివారులోని పత్తిగుట్ట సమీపంలో తన పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్లాడు. రాయమల్లు పక్కనే అదే గ్రామానికి చెందిన రైతు కర్నె రాములు వ్యవసాయ భూమి ఉంది. వన్యప్రాణుల నుంచి పంట రక్షణ కోసం రాములు తన చేను చుట్టూ ఇనుప వైర్‌తో కంచెను ఏర్పాటు చేసి, అక్రమంగా వ్యవసాయ విద్యుత్ 11కెవీ లైన్ నుంచి కనెక్షన్ ఇచ్చాడు. విషయం తెలియని రాయమల్లు తీగలకు తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. సంఘటన స్థలాన్ని ఎస్‌ఐ శీలం లక్ష్మణ్‌తో పాటు పెద్దపల్లి సీఐ ప్రవీణ్ కుమార్ పరిశీలించి వివరాలు సేకరించారు. రాయమల్లు కొడుకు మహిపాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాములుపై కేసు నమోదు చేశారు.